https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 364 బుధవారం 15-4-2026 పేజీలు : 4

**రిపోర్టర్స్ కావలెను**

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా? అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను... మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు 9989788438, 9505285656.

## డీలిమిటేషన్‌పై అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలి



◆ సీఎం రేవంత్ రెడ్డి ◆ మహిళల రిజర్వేషన్ బిల్లుకు పూర్తి మద్దతు..

**హైదరాబాద్, ఏప్రిల్ 14**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగకుండా జాతీయ స్థాయిలో విస్తృత చర్చలు జరపాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాల ద్వారానే నిర్ణయం తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశం కావడంతో బాధ్యతా యుతంగా ఈ లేఖ రాసినట్లు తెలిపారు. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్, పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను ఒకదానితో ఒకటి ముడిపెట్టి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని, అవి పూర్తిగా వేర్వేరు విషయాలని స్పష్టం చేశారు. మహిళల రిజర్వేషన్ బిల్లుకు భారత జాతీయ కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లలోనే 33 శాతం మహిళల రిజర్వేషన్‌ను యథాతథంగా వెంటనే అమలు చేయాలని సూచించారు. ఆయా రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా అమలు చేయాలని కోరారు. మహిళల రాజకీయ సాధికారత కేవలం చట్టపరమైన మార్పుకాదని, అది ప్రజాస్వామ్యానికి ఒక నైతిక అవసరమని పేర్కొన్నారు. పునర్విభజనకు సంబంధించి గతంలో కూడా సీట్ల సంఖ్య పెంచకుండా కేవలం నియోజక వర్గాల సరిహద్దులను మారుస్తూ డీలిమిటేషన్ నిర్వహించారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా దేశవ్యాప్తంగా అలాంటి ప్రక్రియను చేపట్టవచ్చని తెలిపారు. లోక్‌సభ సీట్లను 850కు పెంచే ప్రతిపాదన అసలైన వివాదాస్పద అంశమని పేర్కొన్నారు. ప్రస్తుత సీట్లను పెంచి వాటిని కేటాయించే ఆలోచనపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రిజర్వేషన్‌కు పూర్తి మద్దతు ఇవ్వటంతో పాటు, సీట్ల సంఖ్య పెంపు లేకుండా డీలిమిటేషన్‌కు తాము పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం లోక్‌సభ సీట్ల పెంపు ప్రతిపాదనను అనేక రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించవని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ రకంగా అమలు చేస్తే దేశంలో తలెత్తబోయే పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు.

1970 నుంచి దేశం జనాభా నియంత్రణ విధానంపై దృష్టి పెట్టినప్పటికీ, రాష్ట్రాల వారీగా జనాభా నియంత్రణ అమలు జరిగిన తీరు భిన్నంగా ఉందని అన్నారు. జనాభాలో తేడాలతో జాతీయ ఐక్యతపై ప్రభావం పడే ప్రమాదాన్ని గుర్తించి, ఇందిరా గాంధీ, అటల్ బిహారి వాజ్‌పేయి వంటి నాయకులు ఈ అంశాన్ని ఒక్కోసారి 25 సంవత్సరాల పాటు వాయిదా వేసినట్లు తెలిపారు. ఆర్థిక సహకారం, సామాజిక, మానవ అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఈ పద్ధతిలో సీట్ల పెంపు చేస్తే దేశ ఫెడరల్ సమతుల్యత దెబ్బతింటుందని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అన్ని ప్రాంతాల సమాన ప్రాతినిధ్యం దేశానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు.

## బిహార్ నూతన సీఎంగా సమ్రాట్ చౌధరీ



**పాట్నా, ఏప్రిల్ 14 :**

బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ కాసేపటి క్రితమే రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ(యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. కాగా, ఏప్రిల్ 15వ తేదీన బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## యుద్ధం వేళ ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడి ఫోన్..



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 :**

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్-అమెరికా ద్వైపాక్షిక సహకారం, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి వీరి మధ్య చర్చ జరిగింది. ఈ విషయాన్ని ప్రధాని మోదీ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమైన తర్వాత ప్రధాని మోదీతో ట్రంప్ మాట్లాడడం ప్రాధాన్యం సంతరించుకుంది 'మిత్రుడు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతిని సమీక్షించుకున్నాం. అన్ని రంగాలలో సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలోని పరిస్థితి గురించి కూడా చర్చించాం. హోర్ముజ్ జలసంధిని తెరవడం, సురక్షితంగా ఉంచడం గురించి మాట్లాడుకున్నాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు


## ఛత్తీస్‌గఢ్‌లో భారీ పేలుడు 10 మంది మృతి

**ఛత్తీస్‌గఢ్, ఏప్రిల్ 14 :**



ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సక్తి జిల్లాలోని వేదాంత పవర్ ప్లాంట్లో బాయిలర్ పేలడంతో 10 మంది కార్మికులు మృతి చెందగా, సుమారు 40 మంది గాయపడ్డారు. ఈ ఘటన బాయిలర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సంఘటన సమయంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రమాదానికి గల అసలు కారణాలు ఏమిటి అనే దానిపై పరిశీలన కొనసాగుతోంది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం మరోసారి పారిశ్రామిక భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. భారీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## మహిళా రిజర్వేషన్‌తో కొత్త యుగం ప్రారంభం ప్రధాని మోదీ



**ఢిల్లీ, ఏప్రిల్ 14**

భారత నారీ శక్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ లేఖ రాశారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల కలను సాకారం చేశామని ప్రకటించారు. శాసనసభలు, పార్లమెంటులో మహిళల భాగస్వామ్యం దేశ భవిష్యత్తును మారుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నారీ శక్తి వందన్ అధినియం బిల్లు చట్టం మాత్రమే కాదని, దేశ నిర్మాణంలో మహిళలకు లభించిన గౌరవమని వెల్లడించారు. మహిళల అభివృద్ధి నుంచి 'మహిళల నేతృత్వంలోని అభివృద్ధి' దిశగా భారత్ అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. దేశం 'వికసిత్ భారత్'గా మారడంలో మహిళల పాత్ర కీలకమని అన్నారు. ఈ చారిత్రక మార్పును స్వాగతిస్తున్న భారత నారీ శక్తికి ప్రధాని హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహిళా బిల్లు చట్టం అమలు చేసేందుకు తమ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## కేటీఆర్.. నీ చెల్లి అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పు : మహేశ్ గౌడ్



**ఖమ్మం, ఏప్రిల్ 14**

బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దుర్మార్గమైన పరిపాలన చేశారని ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని.. ఆయన పాదయాత్ర కాదని.. ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్.. అప్పులు చేసి ఫాంహౌస్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు మీ చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో ఏం చేశారని.. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క లెక్కలతో సమాధానాలు అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రావు ఎలా సంతోషంగా ఉన్నారో.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆనందం ఏంటో మీ దోపిడీ ఎంతో.. మీ చెల్లెలు కవిత చెబుతోందని సెటైర్లు గుప్పించారు. పదేళ్లు దోపిడీకి అలవాటు పడి నేడు పదవులు కోల్పోయి ప్రజల ఆగ్రహానికి గురై నేడు విలవిలలాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చిమాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు.

**కాంగ్రెస్‌ది ప్రధాన పాత్ర..**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకారం కార్యక్రమం ఈరోజు(మంగళవారం) జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లా.. కాంగ్రెస్‌కి ఎప్పుడూ అండగా నిలిచిందని ఉద్ఘాటించారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహ రావు దేశ ప్రధాని అయ్యారని ప్రస్తావించారు. ఇది ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో నేడు తెలంగాణలో అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా వారికి నచ్చినట్లుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే.. కాంగ్రెస్ అడ్డుకుందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాట ఫలితంగా కులగణన చేశారని ప్రస్తావించారు. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని అన్నారు.

## ఎండల్లో బయటకు రావొద్దు..

ప్రజలకు మంత్రి సీతక్క సూచనలు



**హైదరాబాద్, ఏప్రిల్ 14**

ఎండల్లో బయటకు రావొద్దని ప్రజలకు తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా వంటివి తప్పనిసరిగా ధరించాలని దిశానిర్దేశం చేశారు. ఎండదెబ్బ ప్రమాదమని.. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. అధికారులు గ్రామాలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సౌకర్యాలను కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## జాతీయ రహదారులపై కొత్త ఫీజు విధానం

**ఢిల్లీ, ఏప్రిల్ 14**

జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు విధించే జరిమానాలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సవరించింది. జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు భారీ జరిమానా విధించబోతున్నట్టు తెలిపింది. ఈ నిబంధనలు ఏప్రిల్ 15వ తేదీ నుంచి అమల్లోకి రాబోతున్నాయి వాహనానికి అనుమతించిన బరువు కంటే అదనంగా ఉన్న భారాన్ని బట్టి జరిమానా వసూలు చేస్తారు. అనుమతించిన దాని కంటే పది శాతం ఓవర్‌లోడ్ ఉంటే జరిమానా ఉండదు. 10 నుంచి 40 శాతం వరకు ఓవర్‌లోడ్ ఉంటే సాధారణ టోల్ రుసుము కంటే రెండు రెట్లు అధికంగా వసూలు చేస్తారు. 40 శాతం కంటే ఎక్కువ ఓవర్‌లోడ్‌తో వెళితే నాలుగు రెట్లు అదనంగా టోల్ రుసుము విధిస్తారు ఓవర్‌లోడ్‌కు విధించే జరిమానాను ఫాస్టాగ్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది.

## ఇందిరమ్మ ఇళ్లపై ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయి: భట్టి విక్రమార్క

**ఖమ్మం ఏప్రిల్ 14**

దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్‌లో మనమంతా పని చేయటం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. అలాగే, అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని జడ్పీ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. దేశాన్ని ఏలుతున్న బీజేపీ కూడా కాంగ్రెస్ తర్వాతే వచ్చిందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు.

దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అబి .వృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.

# అంబేద్కర్ ఆదర్శనీయుడు

**తహసీల్దార్ దిలీప్ కుమార్**



**లక్షెట్టిపేట ఏప్రిల్14(మన సమాజం)**
భారత రత్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ అందరికీ ఆదర్శనీయుడని తహసీల్దార్ దిలీప్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, మార్గదర్శకుడు బాబా సాహెబ్ అంబేద్కర్ సేవలు మరువలేనివన్నారు. భారత దేశ భవిష్యత్ ను ముందే ఊహించి రాజ్యాంగాన్ని అత్యంత జాగ్రత్తగా రూపొందించిన ఘనత అంబేద్కర్ కు దక్కుతుందన్నారు. మహిళ హక్కులు, 8 గంటల పని విధానం, భారీ నీటి ప్రాజెక్టుల ప్రత్తిపాదన, ఆర్ బీ ఐ ఏర్పాటు లాంటి ఎన్నో కీలక రంగాల్లో బహుముఖ ప్రతిభ కనబర్చిన విజ్ఞాని అంబేద్కర్ అని కొనియాడారు.ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. విద్యతోనే అన్ని రకాల అజ్ఞానాన్ని తొలగించుకోవచ్చని ప్రపంచానికి చాటిన మహనీయుడు అంబేద్కర్ అని వివరించారు. అంతకుముందు రెవెన్యూ సిబ్బందితో కలిసి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులార్పించారు.ఈ కార్యక్రమంలో డీ టీ శ్రావణి, ఆర్ ఐ సునీత, జీ పీ ఓ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌పై రాజకీయం వద్దు

**సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్**

**దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనివ్వబోమని హామీ**

**హైదరాబాద్, ఏప్రిల్ 13**
నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) మరియు మహిళా రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ అంశాలను రాజకీయం చేయవద్దని ఆయన కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి సూచించారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన హామీ ఇచ్చారు. తాము కూడా దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నామని, ఇక్కడి రాష్ట్రాల ప్రయోజనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగనివ్వబోమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను వివరిస్తూ, ఇది 2011 జనాభా లెక్కల ప్రకారమే జరుగుతుందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం రెండేళ్ల సమయం పడుతుందని, అంతవరకు వేచి చూడకుండా అనవసరంగా ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని కోరారు. రాజ్యాంగబద్ధంగా జరిగే ఈ ప్రక్రియను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సరికాదని ఆయన హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'చప్రాసీ' వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కిషన్ రెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది వారికి చప్రాసీ పదవి కూడా రాదన్న రేవంత్ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. రేవంత్ రెడ్డి వారానికి ఒకసారి ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో ఏ పదవి కావాలన్నా ఢిల్లీకి డబ్బులు మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందని, కానీ భారతీయ జనతా పార్టీలో అటువంటి సంస్కృతి లేదని ఆయన ధ్వజమెత్తారు. దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులుగా తాము దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. పదవుల కోసం పాకులాడే చరిత్ర తమది కాదని, ప్రజల ఆశీస్సులతోనే బాధ్యతలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేంద్రంపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి నిత్యం ఢిల్లీ చుట్టూ తిరగడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన విమర్శించారు.

# సింగర్ మంగ్లీ, అడ్వకేట్ సుబ్బారావు వివాదం

**పంజాగుట్ట సీఐ రామకృష్ణ క్లారిటీ**

**ఫైనాన్స్ స్కామ్‌పై పోలీసులకు అందని అధికారిక ఫిర్యాదులు**

**అడ్వకేట్ సుబ్బారావుకు బ్రీత్ అనలైజర్ టెస్ట్.. 27 ఎంజీగా నమోదు**

**విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక**

**హైదరాబాద్, ఏప్రిల్ 13**
ప్రముఖ సింగర్ మంగ్లీ మరియు అడ్వకేట్ సుబ్బారావు మధ్య నెలకొన్న వివాదం పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. ఈ కేసులో వినిపిస్తున్న వివిధ రకాల ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై పంజాగుట్ట సీఐ రామకృష్ణ సోమవారం మీడియాకు పూర్తి వివరాలను వెల్లడించారు. రెండు వర్గాల నుండి అందిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలిస్తున్నామని, చట్టప్రకారం నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ వివాదం ప్రస్తుతం నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదం వెనుక ఒక పెద్ద ఫైనాన్స్ స్కామ్ ఉందనే వార్తలపై సీఐ స్పందిస్తూ కీలక విషయాలను వెల్లడించారు. ఇప్పటివరకు సదరు ఫైనాన్స్ స్కామ్‌కు సంబంధించి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి అధికారిక ఫిర్యాదులు అందలేదని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, బాధితులుగా చెప్పుకుంటున్న వారు కూడా ఈ స్టేషన్ పరిధిలోకి రారని ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఆర్థిక లావాదేవీల అంశంపై ఫిర్యాదులు అందితే వాటిని సంబంధిత విభాగాలకు బదిలీ చేస్తామని, ప్రస్తుతానికి ఆ ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని చెప్పారు. మరోవైపు, అడ్వకేట్ సుబ్బారావు ప్రవర్తనపై సీఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి..

**చైర్మెన్ గోడిసేల సంధ్యారాణి-రాజారమేష్**



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 14, (మన సమాజం):**
అంబేద్కర్ ఆశయా సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ చైర్మెన్ గోడిసేల సంధ్యారాణి-రాజారమేష్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా. బి ఆర్ అంబెడ్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సిఎస్పి, మున్సిపల్ కార్యాలయం, అంగడి బజార్ అంబేద్కర్ విగ్రహం, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం, నాగార్జున కాలనీలో పలు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మెన్, నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని అంబెద్కర్ అని కోనియాడారు. దేశంలో కుల పిచ్చిని తరిమికొట్టి రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు కల్పించి దేశానికి మార్గదర్శకాలు చేసిన గొప్ప మేధావి అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను నేటితరం యువత కాపాడాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ఈ కారుక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, వైస్ చైర్మెన్ మిట్టపల్లి సరిత – శ్రీనివాస్, కౌన్సిలర్లు, పలు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# శాంతిఖనిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**బెల్లంపల్లి ఏప్రిల్ 14 మన సమాజం**
బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని బొగ్గుగని ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు సంఘం మాజీ అధ్యక్షుడు ఆవుల రవికి రణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గ్రూప్ ఇంజనీర్ చెరిపెల్లి బస్వరాజ్, గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా జ్యోతి వెలిగించి, పంచశీలా జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా అనేక వర్గాల ప్రజలు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. చదువు ద్వారానే అంబేద్కర్ దేశ రాజ్యాంగ నిర్మాతగా ప్రపంచానికి దిక్సూచిగా నిలిచారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు కార్మికులు, అధికారులు అంకితభావంతో పనిచే యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రాజనాల రమేష్, అధ్యక్షుడు చీమల హరీష్, గని వెంటిలేషన్ అధికారి దాసి నాగవర్ధన్, గని రక్షణాధికారి పి. రాజు, సీనియర్ అండర్ మేనేజర్ సంతోష్, బీసీ లైజన్ ఆఫీసర్ ముస్తాఫా, గని సర్వే అధికారి ఉప్పులేటి రమేష్, క్షేమాధికారి ఎరుపుల రవి కుమార్, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్ రాజ లింగయ్య, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమరి వెంకటేష్, ఐటీయూసీ నాయకుడు మంతెన రమేష్ పాల్గొన్నారు.

# బాబా సాహెబ్ స్ఫూర్తితో రాజ్యాంగ రక్షణకు కృషి

**అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు**

**పట్టణంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు**



**లక్షెట్టిపేట ఏప్రిల్ 14(మన సమాజం)**
భారత రత్న, రాజ్యాంగ నిర్మాత, నూతన భారత నిర్మాత డా. బాబా సాహెబ్ స్ఫూర్తితో రాజ్యాంగం రక్షణకు, హక్కుల సాధనకై నిరంతరం పోరాడుతామని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు పంచశీల జెండా ఎగురావేసినన్ అనంతరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షెట్టిపేట మున్సిపల్ చైర్పర్సన్ ఎస్సీ కావడం అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో కల్పించిన హక్కుల్లో భాగంగా ఎస్సీలకు రిజర్వ్ చేశారన్నారు. ఎవరో మనకు బిక్షగా పెట్టలేదని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బహుజనులంతా ఐక్యంగా ఉండి, తమ జాతులకు అన్యాయం జరిగితే పోరాడి న్యాయం చేసేలా తయారు కావాలన్నారు.



విద్య, ఉపాధి అవకాశాలు అందిపుచుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దొంత అంజలి నర్సయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపెల్లి రమేష్, మండల ఉపాధ్యక్షులు భైరం లింగన్న, కార్యదర్శి అడ్లూరి శివ కుమార్, సీనియర్ నాయకులు తొగరు కాంతయ్య, గోల్కొండ సత్తయ్య, తొగరు గంగారాం, వార్డు కౌన్సిలర్లు పెట్టం తిరుపతి, సిద్ధార్థ, కో ఆప్షన్ నెంబర్ నక్క జాకబ్, తోగరు ప్రసాద్, కండె మొగిలి, గంధం సందీప్, పెండం అశోక్, తోగరు సుమన్, మొగిలి, రాకేష్, దేవయ్య, ఆసాది సాయి, చేన్న ప్రదీప్, నిమ్మ రత్నాకర్, పెట్టం శ్రీనివాస్, మల్యాల శివ, కోలా పురుషోత్తం, మెట్పల్లి సత్యం, దుంపటి కుమారస్వామి, ఎనగందుల లక్ష్మణ్, కట్ల సతీష్,తదితరులు పాల్గొన్నారు.

# బాబాసాహెబ్‌కు ప్రధాని మోదీ ఘన నివాళి

**అంబేద్కర్ ఆశయాలు దేశానికి నిరంతర ప్రేరణాత్మకం**

**ప్రేరణా స్థల్ వద్ద ప్రధాని, ఖర్గే ఆత్మీయ పలకరింపు**

**ప్రగతిశీల సమాజ నిర్మాణం కోసం బాబాసాహెబ్ కృషి అనన్యం**




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14**
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం పార్లమెంట్ ఆవరణలోని 'ప్రేరణా స్థల్' వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ప్రధాని నరేంద్ర మోదీ పుష్పాంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు. ప్రగతిశీల సమాజం నిర్మాణం కోసం అంబేద్కర్ కన్న కలలు, ఆయన ఆశయాలు దేశ ప్రజలందరికీ నిరంతరం ప్రేరణ కలిగిస్తాయని ఈ సందర్భంగా ప్రధాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పాల్గొని బాబాసాహెబ్‌కు నివాళులర్పించారు. పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఈ నివాళి కార్యక్రమంలో ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా అదే సమయంలో ప్రేరణా స్థల్ వద్ద నివాళి అర్పించేందుకు వచ్చారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, ఖర్గే ఎదురెదురు పడగా, ఇరువురు నేతలు ఒకరితో ఒకరు కాసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి, వారిద్దరూ చిరునవ్వుతో పలకరించుకోవడం, ఫోటోలకు ఫోజు ఇవ్వడం అక్కడి వారందరినీ ఆకట్టుకుంది. అనంతరం ప్రధాని మోదీ అందరికీ అభివాదం చేస్తూ అక్కడి నుండి నిష్క్రమించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రధాని మోదీ తన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) లో ప్రత్యేకంగా స్పందించారు.

# ఘనంగా డా. బి. ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు

### జేఎన్టీయూహెచ్ విద్యార్థి ఐకాస రాష్ట్ర చైర్మన్, డా. బి. ఆర్. అంబేద్కర్ ప్రతిభ పురస్కర్ అవార్డ్ గ్రహీత ఎరవెల్లి జగన్

**హైద్రాబాద్, ఏప్రిల్ 14 :**
ప్రపంచ మేధావి,డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు జేఎన్టీయూహెచ్యూనివర్సిటీ లో కేపీహెచ్బి కాలనీ, కూకట్పల్లి లో ఘనంగా నిర్వహించారు ఈ సందర్బంగా జేఎన్టీయూహెచ్ విద్యార్థి ఐకాస చైర్మన్, డా. బి. ఆర్. అంబేద్కర్ ప్రతిభ పురస్కర్ అవార్డ్ గ్రహిత ఎరవెల్లి జగన్ మాట్లాడుతు మనిషిని మనిషిగా చూడడమే మానవత్వం అని అంబేద్కర్ అన్నారు అని అలా కాకుండా సాటి మనుషలను హీనంగా చూస్తూ, పక్షులను, జంతువులను ప్రేమించే విచిత్రమైన సంస్కృతి భారతదేశంలో పెరుగుతుందని,ఇది ఇలాగే కొనసాగితే మానవ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం లేకపోలేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికి అంబేద్కర్ ను అర్థం చేసుకోవాలంటే తను రాసిన రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవాలి. అది ఇంకా భారతీయుల మనసులలోకి, మెదళ్లలోకి చేరలేదు. అది కేవలం కొంతమంది చేతుల్లో ఆభరణంగానే ఉంది. దీని ప్రతిఫలాల కోసం సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమం జరగాలి. అందుకు విద్యావంతులు, మేధావులు, ఉద్యోగస్తులు, రచయితలు భాగస్వామ్యం కావడమే బాబాసాహెబ్ కు మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాందేవ్ రావు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు, జై భీమ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి. ఎల్. ప్రసాద్, కేపీహెచ్బి దళిత ఐక్య వేదిక నాయకులు మైకేల్, ఎస్సి ఎస్టీ



అసోసియేషన్ అధ్యక్షులు బాబ్జి కుమార్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పవన్, బీజేపీ దళిత మోర్చా నాయకులు చిన్న దేవ సహాయం, సొలొమోన్, జాన్ మోజెస్, ఎస్ఎఫ్ ప్రెసిడెంట్ రాహుల్ నాయక్, సాగర్, బంజారా సంఘం నాయకులు లకావత్ భానుప్రకాష్ నాయక్, రాజ్ కుమార్ నాయక్, రూప్ సింగ్,ఎస్సి రస్టీ విద్యార్థి సంఘం నాయకులు భైరం ప్రేమ్ కుమార్, అజేయ్, ప్రదీప్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పదవికి నితీశ్ కుమార్ రాజీనామా

### - బీహార్ రాజకీయాల్లో కీలక మలుపు - సుదీర్ఘ పాలనకు ముగింపు పలికిన రికార్డుల రారాజు



**పాట్నా, ఏప్రిల్ 14**
బీహార్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘమైన అధ్యాయం ముగిసింది. రాష్ట్రానికి అత్యధిక కాలం ముఖ్య మంత్రిగా సేవలందించి, ఏకంగా 10 సార్లు ఆ పదవిని చేపట్టిన రికార్డు సృష్టించిన నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం పాట్నాలోని లోక్భవన్లో రాష్ట్ర గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యిద్ ఆటా హస్నైన్ను కలిసి తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ సందర్భంగా రాజ్భవన్లో రాజకీయ సందడి నెలకొనగా, నితీశ్ రాజీనామా నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రిగా తన బాధ్యతల నుంచి తప్పుకుంటూ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక లోతైన రాజకీయ కారణాలు ఉన్నప్పటికీ, ఆయన రాజ్యసభకు వెళ్లడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రాష్ట్ర రాజకీయాల నుండి జాతీయ రాజకీయాల వైపు తన ప్రయాణాన్ని నితీశ్ కుమార్ ఇప్పటికే ప్రారంభించారు. ఇటీవలే ఆయన రాజ్యసభకు ఎన్నికైన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 19వ తేదీన ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఒకే సమయంలో రెండు చట్టసభల్లో సభ్యత్వం కలిగి ఉండటం సాధ్యం కానందున, నిబంధనల ప్రకారం ఆయన ముఖ్యమంత్రి పదవికి, అలాగే శాసనసభ సభ్యత్వానికి వీడ్కోలు పలకవలసి వచ్చింది. ఈ క్రమంలోనే తన కేబినెట్ సహచరులతో చివరిసారిగా సమావేశమైన అనంతరం ఆయన రాజీనామా నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించి గవర్నర్కు అందజేశారు. తన రాజీనామా గురించి నితీశ్ కుమార్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ముఖ్యమంత్రి పదవిని వదులుకోవాలని నిర్ణయించుకున్నానని, క్యాబినెట్ సమావేశం ముగిసిన తర్వాత గవర్నర్ను కలిసి తన లేఖను సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. బీహార్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, రాబోయే రోజుల్లో రాష్ట్రం మరిన్ని విజయాలు సాధిస్తుందని ఆకాంక్షించారు. ప్రజా సేవలో తన వంతు పాత్రను జాతీయ స్థాయిలో కొనసాగిస్తానని, రాజ్యసభ సభ్యుడిగా బీహార్ ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నితీశ్ కుమార్ వైదొలిగిన నేపథ్యంలో బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుతానికి కొత్త సీఎం ఎవరన్నది అధికారికంగా ఖరారు కాలేదు. అయితే, అధికార కూటమిలో తదుపరి వారసుడి ఎంపికపై అంతర్గత చర్చలు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం నాటికి కొత్త ముఖ్యమంత్రి పేరు ఖరారయ్యే అవకాశం ఉందని, అదే రోజున ప్రమాణ స్వీకార కార్యక్రమం కూడా నిర్వహించవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పుల వల్ల రాష్ట్ర పాలనలో ఎటువంటి అడ్డంకులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన పూర్తి మద్దతు, మార్గదర్శకత్వం ఉంటుందని నితీశ్ కుమార్ హామీ ఇచ్చారు. బీహార్ రాబోయే రోజుల్లో సాంకేతికంగా ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత కొన్ని దశాబ్దా లుగా బీహార్ అభివృద్ధిలో నితీశ్ పాత్ర అమోఘ మైనదని, ఆయన వేసిన పునాదులపై కొత్త సర్కారు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుందని ఆశిస్తున్నారు. ఒక యుగం ముగిసి బీహార్ కొత్త నాయకత్వంలోకి వెళు_న్న తరుణంలో, రాష్ట్ర ప్రజలు మరియు రాజకీ య వర్గాలు ఈ మార్పును ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# సామాజిక సమరసత మహోత్సవం

**గాంధీనగర్లో బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు**

**సమ్మిళిత అభివృద్ధికి సామరస్య ధోరణి అత్యవసరం**

**సామాజిక ఐక్యతను పటిష్టం చేసేది సమగ్ర విద్యే**

**గుజరాత్ లోక్భవన్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం**

**గాంధీనగర్, ఏప్రిల్ 14**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్ రాజధాని గాంధీనగర్లో 'సామాజిక సమరసత మహోత్సవం' ఘనంగా నిర్వహించబడింది. గాంధీనగర్లోని లోక్భవన్లో జరిగిన ఈ విశిష్ట కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, ఆమె సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశాభివృద్ధిలో సామాజిక సామరస్యం పోషించే పాత్రను వివరిస్తూ, అంబేద్కర్ ఆశించిన సమసమాజ స్థాపన దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మన దేశం సమ్మిళిత మరియు సమానత్వంతో కూడిన అభివృద్ధిని సాధించాలంటే సమాజంలోని అన్ని వర్గాల మధ్య సామరస్య ధోరణి అత్యవసరమని రాష్ట్రపతి ముర్ము గారు స్పష్టం చేశారు. ఐక్యత లేని సమాజం సుస్థిరమైన పురోగతిని సాధించలేదని, అందుకే సమరసత అనేది దేశాభివృద్ధికి మూలాధారమని ఆమె అభిప్రాయపడ్డారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో ప్రతి పౌరుడు మరో పౌరుడి గౌరవాన్ని, హక్కులను గౌరవించినప్పుడే బాబాసాహెబ్ కన్న కలలు నిజమవుతాయని పేర్కొన్నారు. ఈ మహోత్సవం ప్రజల్లో సోదరభావాన్ని పెంపొందించడానికి ఒక వేదికగా నిలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని





పటిష్టం చేయడంలో విద్య యొక్క ప్రాముఖ్యతను రాష్ట్రపతి ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. కేవలం అక్షరాస్యత మాత్రమే కాకుండా, విలువలతో కూడిన సమగ్ర విద్య విద్యార్థులలో సామాజిక స్పృహను పెంపొందిస్తుందని వివరించారు. విద్య అనేది వ్యక్తుల మధ్య ఉన్న అడ్డుగోడలను తొలగించి, అందరినీ ఏకం చేసే శక్తిగా ఉండాలని కోరారు. అంబేద్కర్ గారు కూడా విద్య ద్వారానే అణగారిన వర్గాల విముక్తి సాధ్యమని నమ్మారని, నేటి విద్యా వ్యవస్థ ఆ దిశగా యువతను తీర్చిదిద్దాలని ఆమె సూచించారు. గుజరాత్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సమరసత మహోత్సవం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్రపతి కొనియాడారు. సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలు మరియు కార్యక్రమాలు అట్టడుగు వర్గాలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అనుసరించాలని, సామాజిక వివక్ష లేని నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక చైతన్యం మరింత పెరుగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఈ మహోత్సవంలో గుజరాత్ గవర్నర్, ముఖ్యమంత్రి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా గాంధీనగర్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్రపతి ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి స్వయంగా ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం గిరిజన మరియు వెనుకబడిన వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సామాజిక న్యాయం మరియు సమానత్వం కోసం జరిగే పోరాటంలో ఈ మహోత్సవం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఘనంగా బాబాసాహెబ్ జయంతి వేడుకలు

**ఎల్బీనగర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాల వేసి నివాళి అర్పించిన బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కే.గాంధీ నాయక్**



**హైద్రాబాద్, ఏప్రిల్ 14 :**
భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కె గాంధీ నాయక్ నివాళి అర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవత స్ఫూర్తికి నిదర్శనం అంబేద్కర్ అని ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని రచించి ప్రజల అవసరాలను హక్కులను తెలిపిన గొప్ప మహానీయుడు అని కొనియాడారు . ప్రజలకు రిజర్వేషన్ హక్కులను కల్పించడమే కాదు, విధులను కూడా సూచించారు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎవరెవరికి ఎంత రిజర్వేషన్లు ఉండాలి ఎంత వేతనాలు తీసుకోవాలో సమాజంలో ఎలా నడుచుకోవాల్లో రాజ్యాంగంలో అటువంటి మహోన్నత వ్యక్తి జయంతి ఈ రోజున ఆయనను స్మరించుకోవాలి. ఆయన ఆశలను అన్ని పార్టీ నాయకులు పనిచేయాలి ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలు నాయక్ రమేష్ నాయక్ తిరుపతి నాయక్ సురేష్ నాయక్ కుమార్ నాయక్ చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ముచ్చటగా ముగ్గురు

- **పొంగులేటి ఇంట సందడి! రాజకీయాల్లో స్నేహసమ్మేళనం**
- **మంత్రివారి నివాసంలో ఆత్మీయ భేటీకి వేదిక**
- **ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడితో సన్నిహిత చర్చలు**
- **కాంగ్రెస్ నేతల ఐక్యతకు సంకేతంగా సమావేశం**



**ఖమ్మం, ఏప్రిల్ 14 :**
రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రిగారి ఆహ్వానం మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆయన గృహానికి విచ్చేశారు. ముగ్గురు కీలక నేతలు ఒకే వేదికపై కలవడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశం సాంప్రదాయ రాజకీయ భేటీలకు భిన్నంగా, ఎంతో ఆత్మీయ వాతావరణంలో సాగింది. తేనీటి విందుతో ప్రారంభమైన ఈ సమావేశంలో నేతలు సరదాగా ముచ్చటిస్తూ పలు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రాజకీయాల మధ్యలో కూడా ఇలాంటి స్నేహపూర్వక సమావేశాలు నేతల మధ్య అవగాహనను పెంచడంలో కీలకమని భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పలువురు ముఖ్య నేతలు ఒకే చోట చేరడంతో ఈ సమావేశం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ భేటీ కాంగ్రెస్ పార్టీ అంతర్గత ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నేతల మధ్య సమన్వయం, పరస్పర సహకారం పెరగడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని నేతలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. ఖమ్మం జిల్లా రాజకీయాల పరంగా కూడా ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజల్లో పార్టీ ప్రభావం పెంపు వంటి అంశాలపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా జిల్లాలో పార్టీ స్థితిని మెరుగుపరచాలని నేతలు భావిస్తున్నట్లు సమాచారం.ఈ సమావేశం ద్వారా నేతల మధ్య సాన్నిహిత్యం మరింత బలపడినట్లు స్పష్టమైంది. నాయకత్వ స్థాయిలో ఐక్యత ఉంటేనే కేడర్లో ఉత్సాహం పెరుగుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ భేటీ ద్వారా పార్టీ కార్యకర్తలకు కూడా ఒక సానుకూల సందేశం వెళ్లినట్లు భావిస్తున్నారు.సామాన్యంగా రాజకీయ సమావేశాలు కఠిన చర్చలతో సాగుతాయి. అయితే ఈ సమావేశం మాత్రం ఆత్మీయతతో నిండిపోయి ప్రత్యేకతను సంతరించుకుంది. నేతలు పరస్పరం అనుభవాలు పంచుకోవడం, నవ్వులతో సమయాన్ని గడపడం వంటి దృశ్యాలు ఈ సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మొత్తానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశం కేవలం ఒక రాజకీయ భేటీ మాత్రమే కాకుండా, నేతల మధ్య ఐక్యత, స్నేహపూర్వకత, సమన్వయానికి ప్రతీకగా నిలిచింది. భవిష్యత్ రాజకీయాలకు ఇది ఒక దిశానిర్దేశంగా మారే అవకాశముందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## అతని వల్లే డ్యాన్స్‌లో పర్‌ఫెక్షన్!

ఇరవైఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో హిట్ చిత్రాల్లో భాగమైంది అగ్ర కథానాయిక తమన్నా. హీరోయిన్‌గా రాణిస్తూనే మరోవైపు ప్రత్యేక గీతాల ద్వారా యూత్‌లో క్రేజ్ దక్కించుకుంది. ఇటీవలకాలంలో 'స్త్రీ-2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్..' పాట బాగా పాపులర్ అయింది. తమన్నా నటించిన 'డూ యూ వాన్నా పార్ట్‌నర్' అనే వెబ్‌సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో డ్యాన్స్‌లో తన ప్రతిభకు కారణం అల్లు అర్జున్ అని వెల్లడించింది. "బద్రీనాథ్' టైంలో డ్యాన్స్ విషయంలో బన్నీ బాగా ఎంకరేజ్ చేశారు. మంచి పర్‌ఫెక్షన్‌తో డ్యాన్స్ ఎలా చేయాలో అతని నుంచి నేర్చుకున్నా. ఆ సినిమా తర్వాత నాకు డ్యాన్స్ పరంగా చాలా ఆఫర్లొచ్చాయి. స్పెషల్ సాంగ్స్‌తో కూడా పాపులర్ అయ్యాను' అని చెప్పింది తమన్నా. ఈ ఏడాది 'ఓదెల-2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది తమన్నా. ప్రస్తుతం ఈ భామ హిందీలో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## మీనాక్షి చౌదరి ట్రావెల్ డైరీ స్పెషల్..

ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది హర్యానా సుందరి మీనాక్షి చౌదరి. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాలతో హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. గతేడాది మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన లక్కీ భాస్కర్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఎప్పుడూ ఏదో ఒక ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో ఫుల్ బిజీగా ఉండే ఈ భామ కాస్త బ్రేక్ తీసుకొని వెకేషన్ టూర్ ప్లాన్ చేసుకుంది. ఇంతకీ మీనాక్షి చౌదరి ఎక్కడికెళ్లిందనుకుంటున్నారా..? ఈ భామ జపాన్ దేశానికి టూర్ వేసింది. స్టైలిష్ డ్రెస్‌లో ఉన్న మీనాక్షి జపాన్ వీధుల్లో వర్షం పడుతుంటే గొడుగు పట్టుకొని మాన్‌సూన్ అందాలను ఆస్వాదించింది. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి మరి. ఓ వైపు ఛమక్కుమని మెరుస్తున్న చెవిపోగులు, మరోవైపు సాధారణ పోనీటైల్ లాంటి జుట్టుతో ఉన్న ఈ చిన్నది అందమైన చిరునవ్వుతో అందరినీ ఆకర్షిస్తోంది. ప్రతీ వీధిలో మీనాక్షి చౌదరి దిగిన ఫొటోలు జపాన్ టూర్‌ను ఎలా ఎంజాయ్ చేసిందో చెప్పకనే చెబుతున్నాయి. జపాన్ వెకేషన్‌లోని ప్రతీ ఫ్రేమ్ తన ట్రావెల్ డైరీలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. 'కొన్ని యాదృచ్ఛిక విషయాలు, సంఘటనలు మనలో శాశ్వత ముద్ర వేస్తాయి. ఈ అద్భుతమైన రోజు నుండి నాకు అలాంటి ఒక జ్ఞాపకం లభించినందుకు నేను కృతజ్ఞురాలినని భావిస్తున్నాను. జపాన్‌లో మేము ఒక అందమైన కేఫ్‌ను గుర్తించాం. అద్భుతమైన వర్షాభావ దృశ్యాల నుండి అక్కడి అందమైన మనుషులతో అందంగా తయారు చేసిన జపనీస్ టీ వరకు అన్నీ ఆస్వాదించాం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో క్యాప్షన్ పెట్టింది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న మీనాక్షి చౌదరి. ప్రస్తుతం అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తోంది.

## రెండు వేలకు మించి ఖర్చుపెట్టను!

అరంగ్రేటం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం హిందీ,



తెలుగు భాషల్లో ఈ భామ భారీ చిత్రాల్లో నటిస్తున్నది. అల్లు అర్జున్-అట్లీ కాంబో చిత్రంలో ఈ సొగసరి ఓ కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలొస్తున్నా యి. వరుస భారీ సినిమాలతో ఆర్థికంగా కోరుకున్న స్థాయికి చేరుకున్నప్పటికీ..ఖర్చు విషయంలో మాత్రం పొదుపు పాటిస్తుందట ఈ అమ్మడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా డబ్బుపై నియంత్రణ ఉండాలంటూ మృణాల్ చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. 'నాకు ఖరీదైన దుస్తులు కొనడం అస్సలు ఇష్టం ఉండదు. వాటి కోసం ఎంతో ఖర్చుపెడతాం. ఏదో ఒక సందర్భంలో ధరించడం తప్ప అవి ఎక్కువ సమయం బీరువాల్లోనే ఉండిపోతాయి. అందుకే దుస్తుల విషయంలో రెండుమూడు వేలకంటే ఎక్కువగా ఖర్చు చేయను. ఫిల్మ్ ఈవెంట్స్‌కు మాత్రం కాస్త ఖరీదైన డిజైనర్ క్లాత్స్ ధరిస్తాను. అయితే వాటిని అద్దెకు తెచ్చుకుంటాను. అంత డబ్బులు పెట్టి ఎప్పుడూ బట్టలు కొనను' అని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్.

## అదే సక్సెస్ అనుకున్నా.. టార్గెట్ పెట్టుకున్నా.. కానీ

దాదాపు మూడేళ్లగా మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు సమంత చికిత్స తీసుకుంటూనే ఇటు సినిమాలు, అటు ప్రొడక్షన్ హౌస్ పనులు చూసుకుంటోంది. అయితే మయోసైటిస్‌తో పోరాటం తనకెన్నో విషయాలు నేర్పిందని చెబుతున్నారామె. ఒకప్పటితో కంపేర్ చేస్తే ఇప్పుడు ఎన్నో విషయాల్లో తనలో మార్పు వచ్చిందన్నారు సామ్. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మయోసైటిస్ వల్ల జీవితంలో దేనికి ఇంపార్టెన్ ఇవ్వాలో అర్థమైంది. దానితో చేసిన ఆ పోరాటం నన్ను ఎంతగానో మార్చేసింది. గతంలో విజయం అంటే గ్యాప్ లేకుండా సినిమాలు చేయడం అనుకునేదాన్ని. ఏడాదిలో నేను నటించిన ఐదు సినిమాలు విడుదలైన సందర్భాలున్నాయి. అదే సక్సెస్ అని నమ్మి మురిసిపోయేదాన్ని. వరుసగా సినిమాలు చేయాలి, పెద్ద బ్లాక్‌బస్టర్స్‌లో నటించాలి. టాప్ 10 నటీనటుల లిస్ట్‌లో ఉండాలి అని భావించేదాన్ని. బుర్రలో ఎప్పుడూ అదే ఆలోచన. కానీ ఇప్పుడు నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. వివరం తెలిసింది. రెండేళ్లుగా నా సినిమాలు విడుదల కాలేదు, టాప్ 10 లిస్ట్‌లోనూ లేను. అలాగే నా దగ్గర రూ.1000 కోట్ల సినిమాలు అంతకన్నా లేవు. అయినా నేను ఇప్పుడు ఉన్నంతలో సంతోషంగానే ఉన్నా' అని అన్నారు. 'ఖుషి' చిత్రం తర్వాత సమంత మరో చిత్రానికి సైన్ చేయలేదు. తన సొంత బ్యానర్‌లో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో వచ్చిన 'శుభం' చిత్రంలో గెస్ట్ రోల్ చేశారు. ప్రస్తుతం తన సొంత బ్యానర్‌లోనే 'మా ఇంటి బంగారం' చిత్రం మాత్రమే తన చేతిలో ఉంది. ఆ సినిమా షూటింగ్ అప్‌డేట్ ఏమీ లేదు.

